జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
నల్గొండ
సూర్యాపేట - యాదాద్రి భువనగిరి
గురువారం 24 సెప్టెంబర్ 2026 పేజీలు:14





## సింగరాజుపల్లిలో సొంత నిధులతో హైమాక్స్ లైట్ ప్రారంభం:

- బిఆర్ఎస్ నాయకుడు వడ్త్య రమేష్ చొరవ

**డిండి, సెప్టెంబర్ 23, (ప్రజా జ్యోతి) :**
డిండి మండలం పరిధిలోని సింగరాజుపల్లి గ్రామ పంచాయతీలో బీఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన హైమాక్స్ లైట్ బుధవారం స్థానిక సర్పంచ్ వడ్త్య వాలి - శ్రీను నాయక్ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించబడింది.

వివరాలు 2లో

# పంటలను కాపాడేందుకు అన్ని చర్యలు



- వేసవిలో మంచినీటి ఎద్దడి రానివ్వం
- కర్ణాటక సీఎం శివకుమార్‌తో నీటి విడుదలపై చర్చలు
- రూ.26.93 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం
- రాష్ట్ర పౌరసరఫరాలు,నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

2 లో

# లంబో ' ధర' లడ్డు కు - రూ.20616



**- గణనాథుని లడ్డూ వేలంపాటలో సొంతం చేసుకున్న గడ్డం శివ దంపతులు**

**తుంగతుర్తి, సెప్టెంబర్ 23,(ప్రజా జ్యోతి):**
తుంగతుర్తి మండల కేంద్రంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా వెలుగు పల్లి రోడ్డు లోని గల్లీ బాయ్స్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణనాథుని లడ్డూకు బుధవారం వేలంపాట నిర్వహించిన వేలంపాటలో కాలనీవాసులు భక్తులు ఎంతో ఉత్సాహంగా ఈ పాల్గొన్నారు. తీవ్ర పోటీ నడుమ సాగిన ఈ వేలంలో స్వామివారి ప్రసాద లడ్డూను గడ్డం శివ- విజయ దంపతులు రూ.20616 కు దక్కించుకున్నారు. లడ్డూను దక్కించుకున్న గడ్డం శివ దంపతులను స్థానికులు, కమిటీ సభ్యులు, కాలనీవాసులు అభినందించారు. స్వామివారి కృపతో గ్రామం సుభిక్షంగా ఉండాలని ఈ సందర్భంగా భక్తులు కోరుకున్నారు.

# పంటలను కాపాడేందుకు అన్ని చర్యలు

మొదటిపేజీ తరువాయి







**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23(ప్రజా జ్యోతి):**
ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ సాగు చేసిన పంటలను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేస్తున్నామని చెప్పారు.బుధవారం నేరేడుచర్ల మండలం మేడారం గ్రామంలో రూ.26.40 కోట్ల వ్యయంతో నిర్మించిన నేరేడుచర్లదూపాడు డబుల్ రోడ్డును మంత్రి ప్రారంభించారు. అలాగే రూ.20 లక్షలతో నిర్మించిన జానల్‌దిన్నె గ్రామపంచాయతీ భవనం, రూ.33 లక్షలతో నిర్మించిన నేరేడుచర్ల గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించారు. మొత్తం రూ.26.93 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రజలకు అంకితం చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం వల్ల దేశవ్యాప్తంగా వర్షపాతంలో మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు.కొన్ని కీలక దశల్లో వర్షపాతం గణనీయంగా తగ్గడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రకృతిని నియంత్రించడం సాధ్యం కాకపోయినా, అందుబాటులో ఉన్న ప్రతి నీటి చుక్కను సమర్థంగా వినియోగించి రైతులు సాగు చేసిన పంటలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.జలాశయాల్లోని నీటిని పొదుపుగా వినియోగించడంతోపాటు అవసరమైన చోట నీటి విడుదల, ప్రత్యామ్నాయ నీటి వనరుల వినియోగం, జలాశయాల సమర్థ నిర్వహణకు అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.

**కర్ణాటక నుంచి నీటి కోసం ప్రయత్నాలు**

జూరాల ఆయకట్టు కింద సాగు చేసిన పంటలను కాపాడేందుకు కర్ణాటక నుంచి నీటిని విడుదల చేయించే అంశంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో చర్చలు జరిపినట్లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. తెలంగాణ రైతుల ప్రయోజనాల కోసం కర్ణాటక ముఖ్యమంత్రితో మాట్లాడామని, తెలంగాణ విజ్ఞప్తిపై ఆయన సానుకూలంగా స్పందించి నీటి లభ్యతను పరిశీలించి సహకరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.రైతులు సాగు చేసిన పంటలను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని, వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.



**రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయి**

నేరేడుచర్లదూపాడు డబుల్ రోడ్డు నిర్మాణంతో నేరేడుచర్లతోపాటు పత్తేపురం, వైకుంఠపురం, రామలక్ష్మీపురం, మేడారం, బక్కయ్యగూడెం, దూపాడు గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఈ ప్రాంతంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు.రోడ్లు,భవనాల నిర్మాణంతోపాటు యువతకు ఉపాధి కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు.ఇటీవల కోదాడలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు మంచి స్పందన లభించిందని, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.రైతుల రక్షణ, ప్రజా సంక్షేమం, యువతకు ఉపాధి, గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ కె.నరసింహ, హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు,మేడారం సర్పంచ్ సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరాజుపల్లిలో సొంత నిధులతో హైమాక్స్ లైట్ ప్రారంభం:

## బిఆర్ఎస్ నాయకుడు వద్త్య రమేష్ చొరవ

మొదటిపేజీ తరువాయి



గ్రామంలో రాత్రి వేళల్లో చీకటి సమస్యలను తొలగించి, ప్రజల భద్రతను పెంపొందించేందుకు వద్త్య రమేష్ ఈ నిర్ణయం తీసుకున్నారు. తన సొంత గ్రామ పంచాయతీ అయిన సింగరాజుపల్లిపై ఉన్న మక్కువతో, ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా సొంత ఖర్చులతో ఈ హైమాక్స్ లైట్‌ను ఏర్పాటు చేయించడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామాభివృద్ధికి మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తున్న వద్త్య రమేష్ సేవా నిరతిని కొనియాడారు. భవిష్యత్తులో కూడా నియోజకవర్గ వ్యాప్తంగా ఇలాంటి మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, యువజన విభాగం నాయకులు మరియు గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలి

## సెప్టెంబర్ 30లోగా నమోదు చేసుకోవాలి..

### - రైతులకు ఏవో ప్రీతమ్ కుమార్ సూచన



**గరిడేపల్లి,సెప్టెంబర్ 23 (ప్రజా జ్యోతి):**

డిసెంబర్ 1, 2025 నుంచి ఆగస్టు 13, 2026 వరకు కొత్తగా భూమి పట్టాదారు పాస్పుస్తకాలు పొందిన రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ (ఫార్మర్ ఐడీ) చేయించుకోవాల ని మండల వ్యవసాయ అధికారి (ఏవో) ప్రీతమ్ కుమార్ సూచించారు.రైతుల సౌకర్యార్థం సెప్టెంబర్ 22 నుంచి 30వ తేదీ వరకు ప్రత్యేక ఫార్మర్ ఐడీ నమోదు క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఇప్పటివరకు ఫార్మర్ ఐడీ నమోదు చేసుకోని అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఫార్మర్ ఐడీ నమోదు కోసం ఆధార్ కార్డు,పట్టాదారు పాస్పుస్తకం,ఆధార్కు అనుసంధాన మైన మొబైల్ ఫోన్ తీసుకుని సమీపంలోని రైతు వేదికలోని ఏఈఓలను లేదా మీ-సేవ కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, రైతులకు అందించే వివిధ సేవలను మరింత సులభంగా,పారదర్శకంగా అందించేందుకు ఫార్మర్ ఐడీ నమోదు కీలకమని ఏవో ప్రీతమ్ కుమార్ పేర్కొన్నారు.మండలంలోని అర్హులైన ప్రతి రైతు ఫార్మర్ ఐడీ నమోదు చేసుకునేలా ఏఈఓలు రైతులకు అవగాహన కల్పిస్తూ చర్యలు చేపడుతున్నారని తెలిపారు.రైతులంద రూ సెప్టెంబర్ 30లోగా ఫార్మర్ ఐడీ నమోదు చేసుకుని ప్రభుత్వ సేవలు, వ్యవసాయ పథకాల ప్రయోజనాలను పొందాలని ఏవో ప్రీతమ్ కుమార్ కోరారు.

# ఆలేరు ఎమ్మెల్యే ఐలయ్యకు సన్మానం

**ఆలేరు సెప్టెంబర్ 23 (ప్రజా జ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కోలనుపాక ముదిరాజ్ సంఘం బొల్ల బోనీ తోట అధ్యక్షులు చాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య గ్రామానికి వచ్చిన సందర్భంగా వారిని మర్యాదపూర్వక కలిసి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అశోక్ ,మాజీ ఎంపీటీసీ ప్రశాంత్, గ్రామ శాఖ అధ్యక్షుడు సోమిరెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ చాడ రాజు, వట్టిపల్లి శ్రీనివాస్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరరాజు, ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# వినాయక నిమజ్జనం లొ టపాసులు పేలి ఇల్లు దగ్ధం

## మంటల్లో,6లక్షలు నగదు కాలి బూడిద

**భువనగిరి,సెప్టెంబర్ 23(ప్రజాజ్యోతి)**





యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో టపాసుల,నిప్పురవ్వతో ఓ ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఘటనలో ఇంట్లో ఉన్న వస్తువులు,పూర్తిగా దగ్ధం అయ్యాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.భువనగిరి మున్సిపాలిటీ కేంద్రం లోని 33వ వ వార్డు విద్య నగర్ లొ తెల్లవారుజామున సుమారు,4:30 గంటల సమయంలో వినాయక నిమజ్జనం ఊరేగింపు ఇంటి ముందు నుంచి వెళుతుండగా భారీగా టపాసులు కాల్చారు.ఈ క్రమంలో టపాసుల నుంచి ఎగిరిన నిప్పురవ్వ ఇంటి వెంటి లేటర్ ద్వారా లోపలికి వెళ్లి వెనుక గదిలో పడటంతో మంటలు అంటు కున్నాయని బాధితుడు షర్ఫుద్దీన్ తెలిపారు. మంటలు,పొగ బయటకు రావడంతో కుటుంబ సభ్యులు,అప్రమత్తమై గ్యాస్ సిలిండర్లతో పాటు కొన్ని వస్తువులను బయటకు తీసుకొచ్చారు. అల్లా దయవల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగకపో యినా.ఆస్తి నష్టం మాత్రం భారీగా జరిగిందని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది.ఇంటి నిర్మాణ పనుల కోసం ఉంచిన సుమారు 5 నుంచి 6 లక్షల రూపాయల నగదు కాలిపోయిందని కన్నీటి పర్యంతం అయ్యారు. ఇటీవల జరిగిన తమ్ముడి వివాహానికి సంబంధించిన కట్నకానుకలు,కొత్త ఫ్రిజ్ వాషింగ్ మెషీన్,వాటర్ డిస్పెన్సర్,ఫర్నిచర్, అల్మారాలు,లైట్లు,ఫ్యాన్లతో పాటు సర్టిఫికెట్లు, ఆస్తి పత్రాలు,ఇతర ముఖ్యమైన డాక్యుమెంట్లు కూడా పూర్తిగా కాలిపోయాయనిఇంట్లో వస్తువులు దగ్ధం అవుతున్న సందర్భంలో ఫోన్ చేసిన తర్వాత ఫైర్ సిబ్బంది ఆలస్యంగా చేరుకున్నారని,వచ్చిన వాహనంలో నీరు సరిపోక మరో ఫైర్ ఇంజిన్ను రప్పించాల్సి వచ్చిందని బాధితులు ఆరోపించారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకునే సమయానికి ఇల్లు దాదాపు పూర్తిగా కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.తమకు జరిగిన భారీ ఆస్తి నష్టాన్ని జిల్లా కలెక్టర్ మరియు ప్రభుత్వం విచారణ జరిపి ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత కుటుంబం కోరుతోంది అలాగే నిమజ్జనం ఊరేగింపుల్లో టపాసుల కారణంగా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన భద్రతా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.



# గర్భిణీ లు బాలింతలు పోషకాలు గల ఆహారాన్ని

## సేవించాలి ఏసీడిపో యామిని



**భువనగిరి,సెప్టెంబర్ 23 (ప్రజాజ్యోతి)**

భువనగిరి పట్టణం లోని బంజా రాహిల్స్లో నిర్వహించిన పోషకాహార వారోత్స వాల కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది.ఈ కార్యక్రమానికి 31వ వార్డు కౌన్సిలర్ సుమయ్యా తబస్సుమ్ షఫీక్ అహ్మద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.కౌన్సిలర్ మాట్లాడుతూ ఆరోగ్య కరమైన సమాజానికి పునాది మంచి పోషకా హారమేనని అన్నారు. ముఖ్యంగా చిన్నారులు గర్భిణీలు,బాలింతలు మహిళలు సమతుల్యమైన ఆహారం తీసుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. రోజువారీ ఆహారంలో కూరగాయలు, ఆకు కూరలు,పప్పు ధాన్యాలు పండ్లు, పాలు గుడ్లు చిరుధాన్యాలు వంటి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను చేర్చుకోవాలని సూచించారు.చిన్నారుల శారీరక,మానసిక వికాసంలో పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుందని,పిల్లలకు సరైన సమయంలో సరైన పోషకాహారం అందించడం తల్లిదండ్రులతో పాటు సమాజం మొత్తం బాధ్యత అని పేర్కొన్నారు.అంగన్ వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు,ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రజలకు పోషకాహారం,పరిశుభ్రత ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో చేస్తున్న సేవలను అభినందించారు.ప్రతి కుటుంబంలో పోషకాహారంపై అవగాహన పెరగాలి:అదే విధంగా ఏసీడీపీఓ యామిని మాట్లాడుతూ,చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం అందేలా అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లల ఎదుగుదలకు అవసరమైన పోషకాహారం, పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై తల్లిదండ్రులకు నిరంతరం అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమం లొ బానోత్ జ్యోతి అంగన్వాడీ సిబ్బంది,ఆశా కార్యకర్తలు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండ నియోజకవర్గంలో వైభవంగా వినాయక చవితి వేడుకలు:

## ముఖ్య అతిథులుగా హాజరైన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నేనావత్ కిషన్ నాయక్, కేతావత్ భీల్యానాయక్

**గుడిపల్లి, సెప్టెంబర్ 23,(ప్రజా జ్యోతి) :**

దేవరకొండ నియోజకవర్గం గుడిపల్లి మండల పరిధిలోని గుడిపల్లి, వాలిపోల్, గణేపల్లి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో శ్రీ వినాయక చవితి పూజా కార్యక్రమాలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్, కేతావత్ భీల్యానాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆయా గ్రామాల్లోని గణపతి మండపాలను సందర్శించిన నాయకులు, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ.. ఆ విఘ్నేశ్వరుని కృపాకటాక్షాలతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందిస్తూ, ప్రజలంతా భక్తిశ్రద్ధలతో ఇలాంటి ఉత్సవాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని వారు పేర్కొన్నారు. గ్రామాల్లో పండగ వాతావరణం ఉట్టిపడేలా నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాల్లో బిఆర్ఎస్ పార్టీ స్థానిక ముఖ్య నాయకులు, దేవరకొండ పట్టణ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు మరియు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకలను ఘనంగా విజయవంతం చేశారు.





# మాజీ సర్పంచ్ మల్లేష్ పార్థివదేహానికి పూలమాలుడు

**ఆలేరు సెప్టెంబర్ 23 ప్రజా జ్యోతి**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామ మాజీ సర్పంచ్ చిరబోయిన మల్లేష్ యాదవ్ మంగళవారం మరణించగా వారి పార్థివ దేహానికి ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అంతిమ యాత్రలో పాల్గొని వారి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అశోక్, మాజీ ఎంపీటీసీ ప్రశాంత్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# చందంపేట మండలంలో వైభవంగా వినాయక చవితి వేడుకలు

## వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నేనావత్ కిషన్ నాయక్







**చందంపేట, సెప్టెంబర్ 23,(ప్రజా జ్యోతి) :**

చందంపేట మండలంలో వినాయక చవితి నవరాత్రి వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో ఎంతో వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మండల పరిధిలోని తెల్ దేవర్ పల్లి, మొత్య తండ, మరియు గుంటిపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాలను బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నేనావత్ కిషన్ నాయక్ స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి సందర్శించారు. మండపాల వద్ద ఏర్పాటు చేసిన గణనాథునికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నేనావత్ కిషన్ నాయక్ మాట్లాడుతూ ఆ విఘ్నేశ్వరుని దివ్య ఆశీస్సులతో మండల ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, రైతన్నలకు పంటలు సమృద్ధిగా పండి పచ్చని పంటలతో గ్రామాలు సుభిక్షంగా ఉండాలని భగవంతుడిని కోరుకున్నట్లు తెలిపారు. యువత అంతా ఉత్సాహంగా, ప్రశాంతమైన వాతావరణంలో, సమైక్యతతో ఈ నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, వివిధ యువజన సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# గంగిడి విష్ణువర్ధన్ రెడ్డి మృతి బాధాకరం

## మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్

**డిండి, సెప్టెంబర్ 23, (ప్రజా జ్యోతి) :**

నల్గొండ జిల్లా డిండి మండలం దాసరి నెమిలిపూర్ గ్రామానికి చెందిన గంగిడి విష్ణువర్ధన్ రెడ్డి మృతి చెందడం అత్యంత బాధాకరమని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పేర్కొన్నారు. బుధవారం





హైదరాబాద్‌లో విష్ణువర్ధన్ రెడ్డి భౌతికకాయాన్ని రమావత్ రవీంద్ర కుమార్ సందర్శించి, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, విష్ణువర్ధన్ రెడ్డి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విష్ణువర్ధన్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ తీవ్ర శోకంలో ఉన్న వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తూ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ వెంట ఎర్రగుంటపల్లి సర్పంచ్ మాల్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, ఉప్పుగంటి ప్రశాంత్ రావు, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండలో వైభవంగా వినాయక చతుర్థి వేడుకలు:

## - గణనాథుడిని దర్శించుకున్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నేనావత్ కిషన్ నాయక్

**దేవరకొండ, సెప్టెంబర్ 23, (ప్రజా జ్యోతి) :**

దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే కాలనీతో పాటు దేవరకొండ మండలం









అచ్చమ్మ కుంట తండాలో వినాయక చతుర్థి నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన గణపతి మండపాలను బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నేనావత్ కిషన్ నాయక్ బుధవారం ప్రత్యేకంగా సందర్శించారు.మండపాలకు విచ్చేసిన కిషన్ నాయక్‌కు నిర్వాహకులు, స్థానిక ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఆయనకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా నేనావత్ కిషన్ నాయక్ మాట్లాడుతూ.విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుని దివ్య ఆశీస్సులతో దేవరకొండ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని మనసారా కోరుకుంటున్నాను. గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణాల్లో భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రులను నిర్వహించడం మన సంస్కృతి, సాంప్రదాయాలకు నిదర్శనం. ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో, ఆధ్యాత్మిక చింతనతో ఈ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి అని ఆయన పిలుపునిచ్చారు.

---

# గణనాథుని లడ్డూ వేలంలో

## 50 వేలతో దక్కించుకున్న

## యువ న్యాయవాది ఎడమ ప్రవీణ్





**భువనగిరి, సెప్టెంబర్ 23(ప్రజాజ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి,పట్టణంలోని ఆర్బీ నగర్ కాలనీలో 55 సంవత్సరాల చరిత్ర కలిగిన ఆర్బీ నగర్ ఉప్పలమ్మ తల్లి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా పూజలు అందుకున్న గణనాథుని లడ్డూను వేలం నిర్వహించగా,యువ న్యాయవాది,యువజన కాంగ్రెస్ నాయకుడు ఎడమ ప్రవీణ్ భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ రెడ్డి పేరుపై రూ.50,000లకు లడ్డూను వేలంలో దక్కించు కున్నారు.అనంతరం యూత్ అసోసియేషన్ సభ్యులు ముత్యాల మనోజ్ కుమార్,సంపత్ కుమార్ వల్లంశెట్టి సతీష్,దేవరకొండ గణేష్ వాసం సాయికుమార్ మరియు ఇతర సభ్యులు స్వామివారి లడ్డూను ఎడమ ప్రవీణ్ కి అందజేశారు.ఈ సందర్భంగా వినాయక నిమజ్జనం లో యూత్ అసోసియేషన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

---

# అత్యంత వైభవంగా ముగిసిన గణేశుని శోభాయాత్ర



**ఆలేరు సెప్టెంబర్ 23 (ప్రజా జ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని శివాలయంలో ప్రతిష్ఠించిన గణేశుడి నిమజ్జన శోభాయాత్రను బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు.శివాలయం నుంచి ప్రారంభమైన శోభా యాత్ర భక్తుల సందడితో పట్టణ పురవీధుల మీదుగా కొనసాగింది. భక్తులు గణేశుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నృత్యాలు, భజనలతో ఉత్సాహంగా శోభాయాత్రలో పాల్గొన్నారు. అనంతరం గణేశుడి విగ్రహాన్ని గంధమల్ల చెరువుకు తరలించి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు, భక్తులు సహకరించారు. కార్యక్రమంలో పాశికంటి సంతోష్,పాశికంటి వజ్రయ్య,చింతకింది రామానుజం,పులగం భాస్కర్,బొద్దుల రమేష్, పిస్కె ఉపేందర్,చిమ్మి ఆనంద్,పోతుగంటి సంపత్ కుమార్,వుల్లోజు చారి మరియు శివాలయం కాలనీవాసులు,తదితరులు పాల్గొన్నారు.

# విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

- పలు వినాయక మండపాలు, ఆలయాల్లో గణనాథుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే బాలు నాయక్

-11వ వార్డులో చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న ఎమ్మెల్యే











**దేవరకొండ, సెప్టెంబర్ 23, (ప్రజా జ్యోతి) :**

వినాయక నిమజ్జన వేడుకల సందర్భంగా దేవరకొండ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కొలువుదీరిన గణనాథులను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు, రైతులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించారు.

### పలు ఆలయాల్లో గణనాథుడికి ప్రత్యేక పూజలు

దేవరకొండ పట్టణంలోని డిండి రోడ్డు సాయిబాబా దేవాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని అనంతరం శివాలయంలో కొలువైన గణనాథుడిని, 11వ వార్డులో ఏర్పాటు చేసిన వినాయకుడిని, కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద కొలువైన గణనాథుడిని ఎమ్మెల్యే బాలు నాయక్ దర్శించుకున్నారు. అనంతరం కొండమల్లేపల్లి శ్రీ సీతారామాంజనేయ చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో నిమజ్జనానికి సిద్ధంగా ఉన్న వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండమల్లేపల్లి కన్యకా పరమేశ్వరి ఆలయంలోని వినాయకుడిని తిరుమలనగర్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడిని దర్శించుకున్నారు. అనంతరం దేవరకొండ పట్టణంలోని పాత రామాలయంలోని వినాయకుడిని 1వ వార్డులోని ముత్యాలమ్మ గుడి వద్ద కొలువైన గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### 11వ వార్డులో చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న ఎమ్మెల్యే

దేవరకొండ పట్టణంలోని 11వ వార్డులో కొలువైన గణనాథుడిని దర్శించుకున్న సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ గారు తన చిన్ననాటి జ్ఞాపకాలను కమిటీ సభ్యులతో పంచుకున్నారు. మేము చిన్నతనంలో ఈ ప్రాంతంలో, ఇదే కాలనీలో చదువుకునే రోజుల్లో వినాయక చవితి సందర్భంగా ఇక్కడే గణపతిని ఏర్పాటు చేసుకునేవాళ్లం. అప్పటి రోజులు, నాటి మిత్రులు, వినాయక ఉత్సవాల జ్ఞాపకాలు ఇప్పటికీ గుర్తున్నాయి. అంటూ అక్కడి కమిటీ సభ్యులతో తన చిన్ననాటి అనుభవాలను గుర్తుచేసుకున్నారు. చిన్ననాటి నుంచి వినాయక చవితి పండుగతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, అప్పటి ఉత్సవాల జ్ఞాపకాలను కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే బాలు నాయక్ పంచుకోవడంతో అక్కడి వాతావరణం ఆత్మీయంగా మారింది.

### ప్రజలు, రైతులు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థన

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ.. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో దేవరకొండ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలి. రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలి. ప్రతి కుటుంబంలో ఆనందం, అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలి. నియోజకవర్గ ప్రజలందరికీ గణనాథుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను అని అన్నారు. వినాయక నిమజ్జన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని భక్తులకు సూచించారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించి గణపయ్య వద్ద నవరాత్రులు పూజలో ఉన్న లడ్డును వేలంలో దక్కించుకున్న భక్తులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

### భక్తులతో సందడిగా వినాయక మండపాలు

ఎమ్మెల్యే బాలు నాయక్ పలు వినాయక మండపాలు, ఆలయాలను సందర్శించిన సందర్భంగా ఆయా ప్రాంతాల్లో భక్తులు, యువత, కాలనీవాసులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులతో కలిసి ఎమ్మెల్యే ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, దేవరకొండ మున్సిపల్ చైర్‌పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, మాజీ చైర్మన్ ఆలంపల్లి నరసింహ, దూదిపాల వేణుధర్ రెడ్డి, వేమన్ రెడ్డి, వాంకునావత్ బిక్కు నాయక్, దొండేటి మల్లారెడ్డి, లక్ష్మీనారాయణ, కిన్నెర హరికృష్ణ, తేరా సత్యం రెడ్డి, రవి నాయక్, బాబురామ్ నాయక్, సేవా నాయక్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో సద్గురు సాయినాధునికి అభిషేకాలు



**నకిరేకల్, సెప్టెంబర్ 23 (ప్రజా జ్యోతి ప్రతినిధి):**



నకిరేకల్ పట్టణంలోని 13వ వార్డు ఆఫీసర్స్ కాలనీ సంతోష్ నగర్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. గణేష్ మిత్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ సద్గురు సాయినాథునికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయిబాబా ఆశీస్సులు, కృప భక్తులందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయిబాబా భక్తి మండలి ఆధ్వర్యంలో భక్తి భజన కార్యక్రమాలను నిర్వహించారు. భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని, భక్తులు భక్తిశ్రద్ధలతో సాయినాథుని సేవలో పాల్గొన్నారు. సాయిబాబా నామస్మరణతో కాలనీ పరిసరాలు మార్మోగాయి. భక్తులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజల్లో భాగస్వాములయ్యారు. కార్యక్రమం అనంతరం భక్తులు, కాలనీవాసులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ, ఆధ్యాత్మికతతో పాటు సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. సాయిబాబా కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోరెండ్ల శివ టీం సభ్యులు, సాయిబాబా భక్తులు, కాలనీవాసులు, భక్తులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## గొర్రెల మేకల పెంపకం దారుల బాహదురుపేట అధ్యక్షులుగా లక్ష్మణ్

**ఆలేరు సెప్టెంబర్ 23(ప్రజా జ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపల్ పరిధిలోని ఆరవ వార్డు బహదూర్ పేట గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం అధ్యక్షులుగా కాంగ్రెస్ పార్టీకి చెందిన వట్టిపల్లి లక్ష్మణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సంగం బలోబితానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సంఘం సభ్యులు వారికి శుభాకాంక్షలు తెలియజేసి శాలువతో ఘనంగా సన్మానించారు.



## గణేష్ నవరాత్రి ప్రత్యేక పూజలు పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

**నల్లగొండ సెప్టెంబర్ 23 (ప్రజా జ్యోతి ప్రతినిధి)**

నకిరేకల్ పట్టణంలోని సంతోష్‌నగర్‌లో గణేష్ మిత్ర టీం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరై వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వినాయక విగ్రహాన్ని కదిలించి శోభాయాత్రను ప్రారంభించారు. శోభాయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ఉత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కోరండ్ల శివ టీం సభ్యులు, సంతోష్‌నగర్ కాలనీవాసులు, యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





# గంగమ్మ ఒడికి చేరిన గణనాథుడు

- వాడవాడలా అంబరాన్నంటిన వేడుకలు
- కనులపండువగా శోభాయాత్రలు
- కోలాటాలతో కేరింతలు కొట్టిన చిన్నాపెద్దా
- తీరొక్క నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేసిన భక్తులు

**తుంగతుర్తి, సెప్టెంబర్ 23, (ప్రజా జ్యోతి):**



తొమ్మిది రోజులపాటు విశేష పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. విఘ్నేశ్వరుడికి బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రత్యేకంగా అలంక రించిన వాహనాల్లో వినాయక విగ్రహాలను ఉంచి కనుల పండువలా శోభాయాత్రలు నిర్వహించారు. దారి పొడువునా డప్పు చప్పుళ్లు, కోలాటాల నృత్యాలతో చిన్నాపెద్దా కేరింతలు కేరింతల కొడుతూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ముత్యాలతో హోరెత్తించారు. మహిళల కోలాటాలు, బతుకమ్మ పాటలకు డ్యాన్సులు చేస్తూ ఉత్సాహంగా ముందుకు సాగారు. గణనాథులకు ఉత్సవ సమితి నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. వాడవాడలా ప్రతిష్ఠించిన ప్రతిమలను అందంగా అలంకరించిన వాహనాల్లో తరలించారు. ఆయా గ్రామాల్లోని చెరువుల్లో గణ నాథులను నిమజ్జనం చేశారు. 'జై బోలో గణేశ్ మహరాజ్‌కీ.. గణపతి బప్పా మోరియా..' అంటూ నినదిస్తూ గంగమ్మ ఒడికి సాగనంపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ ఉపేందర్ రావు ఆధ్వర్యంలో ఎస్సై క్రాంతి కుమార్



పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు.

## 8 ఫీట్ల పైన ఉన్న గణేష్ లకు మాత్రమే క్రేన్ సౌకర్యం కల్పిస్తాం

**- ఆలేరు ఎస్ సి హెచ్ ఓ ఉదయ్ కిరణ్**

**ఆలేరు సెప్టెంబర్ 23 (ప్రజా జ్యోతి)**

గణనాథుల నిమర్జనం కొరకు క్రేన్ సౌకర్యం 8 ఫీట్ల పైన ఉన్న గణనాథుల కు కల్పిస్తామని ఆలేరు ఎస్సిహెచ్ఓ ఉదయ్ కిరణ్ అన్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపల్ కేంద్రంలోని గోధుమ కుంటలో వినాయకుల నిమజ్జనం ప్రదేశాలను పరిశీలించి అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆలేరు పట్టణ ప్రజలు గణనాథులను ఆలేరు పట్టణంలోని గోధుమగుంట వద్దకు తీసుకురావాలన్నారు అదే కాకుండా చుట్టుపక్కల ఉండే గ్రామాల ప్రజలు దగ్గరలో ఉన్న రాయిగిరి చెరువులో పెంబర్తి చెరువులో భువనగిరి చెరువులో నిమజ్జనం చేయాలని దానికి క్రేన్ ఫెసిలిటీ కల్పించామన్నారు. ఆలేరు పట్టణ గ్రామాల ప్రజలు 8 ఫీట్లపైన ఉన్న గణనాథులను క్రైను సౌకర్యం ఎక్కడైతే ఉంటుందో అక్కడికే తీసుకెళ్లాలన్నారు. క్రైను సౌకర్యం లేని ప్రదేశాలకు వెళ్లి ప్రమాదాలకు గురికాకూడదని సూచనలు ఇచ్చారు. ముందుగా వాటర్ ఫెసిలిటీ ఎక్కడైతే ఉంటుందో అక్కడ ఎంచుకొని గణనాథులను తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మేనేజర్ జగన్మోహన్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు

**ఆలేరు సెప్టెంబర్ 23(ప్రజా జ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో దుర్గ భవాని అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య దంపతులు పాల్గొని గణపతి హోమం అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గ ప్రజలందరూ సంక్షేమంగా ఉండేలా చూడాలని భగవంతుని ప్రార్థించారు. దుర్గ భవాని అసోసియేషన్ సభ్యులు చిక్క శ్రావణ్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే తన ధ్యేయంగా పనిచేస్తూ నిరంతరం ప్రజల మధ్యలో ఉండి ప్రజల సంక్షేమ కోసం ఆరాటపాడే నాయకుడు బీర్ల ఐలయ్యకి త్వరలో మంత్రి పదవి దక్కాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బాలమణి భాస్కర్, వెంకటేశ్వరరాజు, నీలం పద్మ, ప్రకాష్ రెడ్డి, రమేషు, గణేషు ,భాస్కర్ రెడ్డి, సత్తయ్య నాగరాజు ప్రశాంతు వెంకటరెడ్డి శ్రీశైలం శ్రీను నాయక్ రాజేందర్రెడ్డి శంకర్ పద్మ కృష్ణ శివ కృష్ణ మనోజు విశ్వనాధ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# విషజ్వరాల నివారణకు గ్రామాల్లో తక్షణ చర్యలు చేపట్టాలి

## - 100 పడకల ఆసుపత్రి పనులు వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి

## - ఆసుపత్రి పనులను పరిశీలించిన బీఆర్ఎస్ ప్రతినిధులు.. డ్యూటీ డాక్టర్‌కు వినతిపత్రం

**తుంగతుర్తి, సెప్టెంబర్ 23 (ప్రజా జ్యోతి):**

తుంగతుర్తి ప్రాంతంలోని పలు గ్రామాల్లో ఇటీవల కురుస్తున్న చిరుజల్లులతో విషజ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమై ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. గ్రామాల్లో వైద్య సిబ్బందితో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని డ్యూటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజుకు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు నిర్మాణంలో ఉన్న 100 పడకల ఆసుపత్రి పనులను బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం పరిశీలించింది. ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంత పేద ప్రజలకు మెరుగైన ప్రభుత్వ వైద్యం అందించాలనే ఉద్దేశంతో, అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిశోర్ కుమార్ ప్రతిపాదన మేరకు 100 పడకల ఆసుపత్రికి మంజూరు లభించిందని పేర్కొన్నారు. కార్పొరేట్ వైద్యానికి దీటుగా ప్రభుత్వ వైద్య సేవలు అందేలా ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు పారిశుధ్యం, దోమల నివారణ, వైద్య శిబిరాలు వంటి ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపగాని రమేష్, గోపగాని వెంకన్న, బొంకూరి మల్లేష్, ఉప్పుల నాగమల్లు, గుడిపాటి వీరయ్య, గడ్డం సోమేశ్, మల్లెపాక ముత్తయ్య, పాలడుగు జలంధర్, మల్లెపాక యాదగిరి, కొల్లూరి మహేందర్, లాకావత్ సోమన్న, దారావత్ హేమ్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# ఆరోగ్యకరమైన బాల్యం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## - ఐసిడిఎస్ సూపర్వైజర్ ధనమ్మ

## - కక్కిరేణి గ్రామంలో ఘనంగా పోషణ మాసం

**రామన్నపేట, సెప్టెంబర్ 23 ప్రజా జ్యోతి**

ఆరోగ్యకరమైన బాల్యం కోసం ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ ధనమ్మ సూచించారు. బుధవారం రామన్నపేట మండలం కక్కిరేణి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణ మాసం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ చిల్ల మధురవేణి సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రం ద్వారా అందిస్తున్న పోషకాహారం, దాని పోషక విలువలు, వ్యక్తిగత పరిశుభ్రత, ఆహార పదార్థాల వినియోగంపై గర్భిణీలు, బాలింతలు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ ధనమ్మ మాట్లాడుతూ..అంగన్వాడీ కేంద్రాలు కేవలం పిల్లలకు ఆహారం అందించే కేంద్రాలు మాత్రమే కాకుండా, పిల్లల ఆరోగ్యానికి పునాది వేసే వేదికలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తొలి అడుగుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. "ఒక్కరోజు పోషకాహారం కాదుడ ప్రతిరోజూ సరైన పోషణే ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బలం" అని తెలిపారు. ప్రతి కుటుంబం పోషణపై అవగాహన పెంచుకుని, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం కేతమ్మ, అంగన్వాడీ టీచర్లు వీ. ఉమ, పీ. సుధ, సీహెచ్. యశోద,టి. మల్లిక, ఆశా కార్యకర్తలు కవిత, సూర్యకళ, సామాజిక కార్యకర్త వేముల సైదులు, గర్భిణీలు, బాలింతలు, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# ఇనుపు స్తంభాల పరిశీలన 15 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

**ఆలేరు సెప్టెంబర్ 23 (ప్రజా జ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం టంగుటూరు గ్రామంలో ఇనుప స్తంభాలు అధికంగా ఉండడంతో గ్రామంలో విద్యుత్ సమస్య పొంచి ఉందని ఇటీవల జరిగిన మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ జూకంటి అనిల్ అధికారులను ప్రశ్నించగా వెంటనే విద్యుత్ ఏడి పీర్ల నాయక్ బుధవారం గ్రామంలో ఉన్న 9 ఇనుప స్తంభాలను అదేవిధంగా 5 విరిగిపడ్డ స్తంభాలను గుర్తించి త్వరగా సమస్య పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# షారాజీపేట ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షునిగా పరశురాములు

**ఆలేరు సెప్టెంబర్ 23 ప్రజా జ్యోతి**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం సారాజిపేట గ్రామంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మేడి పాపన్న తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కేదాసి మోహన్ పిలుపుమేరకు ఆలేరు మండల ఇన్చార్జి భైరపాక సురేష్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీ నిర్వహించగా గ్రామ శాఖ అధ్యక్షునిగా పుట్టల పరుశురాములు , ఉపాధ్యక్షులుగా ఆడెపు మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా పుట్టల అనిల్, కోశాధికారిగా చిలుకు క్రాంతి, కార్యదర్శిగా కిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారికి నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# చెరుకుపల్లి గణనాథునికి రూ. 10,000 విరాళం అందజేసిన బిఆర్ఎస్ నాయకుడు వడ్త్య రమేష్ నాయక్

**డిండి, సెప్టెంబర్ 23,(ప్రజా జ్యోతి) :**

దేవరకొండ నియోజకవర్గం, డిండి మండలం పరిధిలోని చెరుకుపల్లి గ్రామంలో కొలువైన శ్రీ గణనాథుని ఉత్సవ కమిటీకి బిఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గం నాయకులు వడ్త్య రమేష్ నాయక్ రూ. 10,000/- (పది వేల రూపాయలు) ఆర్థిక విరాళాన్ని ప్రకటించారు. బుధవారం గ్రామంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల సందర్భంగా, పెద్ద తండా మాజీ సర్పంచ్ కాట్రావత్ వెంకటేష్ చేతుల మీదుగా ఈ నగదు విరాళాన్ని ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు సభ్యులు వింజమూరి వెంకటేశ్వర్లు, ముడి శ్రీను, గోరటి ఉపేందర్, లక్ష్మణ్, చిన్న, సాయి, భార్గవ్, రవితేజ, అంజి, నరేష్, బన్నీ మరియు ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కోమేపల్లిలో గణపతి విగ్రహాలకు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నేనావత్ కిషన్ నాయక్ ప్రత్యేక పూజలు

## - ఘనస్వాగతం పలికిన గ్రామస్థులు, ఉత్సవ నిర్వాహకులు

## - ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కిషన్ నాయక్ ఆకాంక్ష









**దేవరకొండ, సెప్టెంబర్ 23,(ప్రజా జ్యోతి) :**
దేవరకొండ మండలం కోమేపల్లి గ్రామంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతిష్ఠించిన పలు వినాయక విగ్రహాల వద్ద బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నేనావత్ కిషన్ నాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మండపాల వద్దకు విచ్చేసిన కిషన్ నాయక్‌కు నిర్వాహకులు, గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారికి ప్రత్యేక అర్చనలు, హారతి సమర్పించారు. ఈ సందర్భంగా నేనావత్ కిషన్ నాయక్ మాట్లాడుతూ... బొజ్జ గణపయ్య అనుగ్రహంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గణేష్ ఉత్సవాలు గ్రామాల్లో సోదరభావాన్ని, ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను, యువకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువజన సంఘాల సభ్యులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చండూరు గీతా విద్యాలయంలో ఘనంగా వినాయక శోభాయాత్ర

## - ప్రిన్సిపల్ నర్సింహా చారి ఆధ్వర్యంలో విద్యార్థుల కోలాహలం

**చండూరు సెప్టెంబర్ 23 (ప్రజా జ్యోతి)**





చండూరు లోని గీతా విద్యాలయంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రిన్సిపల్ నర్సింహా చారి ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుడి శోభాయాత్ర ను అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి, “గణపతి బప్పా మోరియా“ అంటూ నినాదాలు చేస్తూ శోభాయాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు. డప్పు చప్పుళ్లు, కోలాటాలతో పాఠశాల ప్రాంగణం అంతా భక్తి భావంతో మార్మోగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నర్సింహా చారి మాట్లాడుతూ, విద్యార్థులలో భక్తి భావంతో పాటు సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంచడమే లక్ష్యంగా ప్రతి ఏటా గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నిమజ్జనం వేళ.. నిరంతరం అప్రమత్తంగా ఉండాలి....!

## - జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్

## వాడపల్లి వద్ద నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 23,(ప్రజాజ్యోతి ):**
గణేష్ నిమజ్జనం వేళ ఎలాంటి పొరపాట్లు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని నల్గొండ జిల్లా అదనపు కలెక్టర్ జే. శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. బుధవారం దామరచర్ల మండలంలోని వాడపల్లి కృష్ణానది వారధి పై నిమజ్జనం ఏర్పాట్లను ఆర్డీవో ఎస్. రమణారెడ్డి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జనం జరిగే ప్రదేశంలో కట్టుదిట్టమైన భారీకేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ దీపాల ఏర్పాటుచేసి , క్రేన్లను సిద్ధంగా ఉంచాలన్నారు. తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లతో నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఎలాంటి పొరపాటు జరగకుండా అధికారులు సమన్వయంతో పని చేస్తూ నిమజ్జన మహోత్సవాన్ని ప్రశాంతంగా ముగించాలని కోరారు. ఆయన వెంట పలు శాఖల అధికారులు ఉన్నారు.





# పెన్షన్ దార్ల దరఖాస్తు ఫారం పరిశీలన

**ఆలేరు సెప్టెంబర్ 23 ప్రజా జ్యోతి**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం శ్రీనివాసపురం గ్రామంలో బుధవారం పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇంటింటికి వచ్చి పరిశీలన అధికారి నవ్య దరఖాస్తు ఫారాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వడ్ల శోభన్ బాబు మాట్లాడుతూ గ్రామంలో చేయూత పెన్షన్ కొరకు 21 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. నలుగురు ఒంటరి మహిళలు వికలాంగులు ఎనిమిది, వితంతువులు తొమ్మిది ఫిన్సర్ కొరకు అర్హత కలిగిన వారిని ఇంటి వద్దనే సర్టిఫికెట్లను పరిశీలించారు. 57 సంవత్సరాలు నిండిన అర్హత కలిగిన వారికి వృద్ధాప్య పెన్షన్లు కూడా మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భవాని, వార్డు సభ్యులు లావణ్య , పోచమని, పరశురాములు చైతన్య రాజమ్మ పార్వతమ్మ సబిత మౌనిక తదితరులు పాల్గొన్నారు.



# దేవరకొండ గణేష్ శోభాయాత్రలో మత సామరస్యం భక్తులకు మంచినీరు పంపిణీ చేసిన ముస్లిం యువకులు

**దేవరకొండ, సెప్టెంబర్ 23, (ప్రజా జ్యోతి) :**

దేవరకొండ పట్టణంలో అత్యంత వైభవంగా నిర్వహించిన గణేష్ నిమజ్జన శోభాయాత్రలో ఒక అద్భుతమైన మానవతా దృక్పథం చోటుచేసుకుంది. మత సామరస్యానికి, సోదరభావానికి ప్రతీకగా నిలిచేలా స్థానిక ముస్లిం యువకులు శోభాయాత్రలో పాల్గొన్న హిందూ భక్తులకు మంచినీటి సౌకర్యం కల్పించారు. తీవ్రమైన ఎండ, రద్దీని సైతం లెక్కచేయకుండా యువకులు స్వయంగా భక్తుల వద్దకు వెళ్లి మంచినీటి బాటిళ్లను అందిస్తూ తమ సేవాభావాన్ని చాటుకున్నారు. మతాలకతీతంగా మానవత్వమే మిన్న అని చాటిచెప్పిన ఈ యువకుల చొరవపై స్థానికులు మరియు శోభాయాత్ర నిర్వాహకులు ప్రశంసల జల్లు కురిపించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ... దేవరకొండలో దశాబ్దాలుగా కొనసాగుతున్న గంగా-జమునా తెహజీబ్ (మత సామరస్యం) సంస్కృతికి ఈ ఘటనే నిదర్శనమని కొనియాడారు. సమాజంలో శాంతి, ఐక్యతను పెంపొందించేలా వ్యవహరించిన ముస్లిం యువకులను ప్రతి ఒక్కరూ అభినందించారు.



# ఓటరుగా నమోదు చేసుకునే అవకాశాన్ని వినియోగించుకోవాలి...!

## - అఖిలపక్ష భేటీలో ఆర్డీవో రమణారెడ్డి

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 23, (ప్రజాజ్యోతి):**

మిర్యాలగూడ రెవిన్యూ డివిజన్ లో నూతన ఓటర్ గా నమోదు చేసుకోవాలకునే వారు ఫామ్ 6 ద్వారా సంబంధిత బూత్ లెవెల్ ఆఫీసర్ కు గానీ, అంగన్వాడీ టీచర్లకు గాని ఆన్ లైన్ లో నమోదు చేసుకునే అవకాశం ఎన్నికల సంఘం కల్పించనున్నదని మిర్యాలగూడ నియోజకవర్గం ఎన్నికల అధికారి, ఆర్డీఓ ఎస్. రమణారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక రెవిన్యూ డివిజన్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో స్పెషల్ ఇంటెన్సివ్ రెవిజన్ (ఎస్ఐఆర్)పూర్తి చేశామని, హియరింగ్ కూడ పూర్తయ్యిందని ఆయన అన్నారు. నూతన ఓటర్లుగా నమోదుచేసుకోవాలనుకునే ఆన్ లైన్, ఆఫ్ లైన్ లో చేసుకోవచ్చని ఆయన అన్నారు. సమావేశంలో తహసీల్దార్ పి.శ్రీనివాస్, ఎంపీడిఓఎం.శేషగిరిశర్మ, ఆలిండియా మజ్లిస్ ఇత్తేహదుల్ ముస్లిమీన్ జిల్లా సహాయ కార్యదర్శి సయ్యద్ ఫారుక్, తెలంగాణ జన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి జి. నాగేశ్వరరావు, బిఆర్ఎస్ నాయకులు షేక్ మస్తాన్ పాల్గొన్నారు.



# వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

## - జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు, జిల్లా ఎస్పీ ఆకాంక్ష యాదవ్





**ఆలేరు సెప్టెంబర్ 23 (ప్రజా జ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపాలిటీలోని గోధుమకుంట వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను యాదాద్రి జిల్లా ఎస్పీ ఆకాంక్ష యాదవ్, ఇన్చార్జి కలెక్టర్ భాస్కరరావు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో బుధవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ వినాయక నిమర్జనానికి వచ్చే వేలాది మంది భక్తులకు ఉత్సవ కమిటీలకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో చేపట్టిన భద్రత మౌలిక వసతుల ఏర్పాట్లను వారు సమీక్షించారు. భద్రత మరియు నిఘా శోభయాత్ర సాగే మార్గాల్లో సీసీటీవీ కెమెరా లనిగా ట్రాఫిక్ నియంత్రణ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. రాత్రి సమయంలో భక్తులకు ఇబ్బంది కలవకుండా నిమజ్జన ప్రాంతాల్లో ఐమాస్ట్ ప్లాడు లైట్లు భారీ కేట్లను సిద్ధం చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మేనేజర్ జగన్మోహన్ రెడ్డి ఉన్నత అధికారులకు వివరించారు. నిమజ్జనం వద్ద అగ్నిమాపక శాఖ సిబ్బంది తమ సిబ్బందితోపాటు లైఫ్ జాకెట్లు రక్షణ తళ్లతో సిద్ధంగా ఉన్నారన్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు స్థానిక ఈతగాలను నిమజ్జన స్థలం వద్ద అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి శ్రీనివాస్ నాయుడు, సీఐ శంకర్ గౌడ్, ఎస్ హెచ్ ఓ ఉదయ్ కిరణ్, ఎస్సై వినయ్ కుమార్, పోలీస్ సిబ్బంది మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చండూరు శివాజీ నగర్ లో ఘనంగా గణేష్ శోభాయాత్ర

## - మున్సిపల్ చైర్మన్ డా. కోడి శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ కోడి గిరిబాబు ఆధ్వర్యంలో

### అంగరంగ వైభవంగా వేడుకలు

**చండూరు సెప్టెంబర్ 23 (ప్రజా జ్యోతి)**





చండూరు మున్సిపాలిటీ కేంద్రంలోని శివాజీ నగర్ కాలనీలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ కోడి గిరిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహ శోభాయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. కోలాటాల నడుమ గణనాథుడి శోభాయాత్ర శివాజీ నగర్ నుండి ప్రారంభమై పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా సాగింది. "గణపతి బప్పా మోరియా" నినాదాలతో కాలనీ మార్మోగింది. యువకులు, మహిళలు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. అంతకుముందు గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. లడ్డూ వేలం పాట కూడా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, ఉత్సవ కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# పేకాట స్థావరంపై పోలీసులు దాడి.. 9 మంది అరెస్ట్

**హాలియా,సెప్టెంబర్23(ప్రజా జ్యోతి)**



మండలంలోని ఇబ్రహీంపేట గ్రామంలో విశ్వనాథుల వెంకటాచారి ఇంటి ఆవరణలో చట్ట విరుద్ధంగా అందర్ - బాహర్ పేకాట ఆడుతున్న స్థావరంపై బుధవారం హాలియా పోలీసులు దాడి చేసి చేశారు.9 మంది పోలీసులకు పట్టుబడ్డారు.వారిని పాతన బోయిన సైదులు,అనుముల మధు,చాపల మహేష్,వజ్జ యాదయ్య, విశ్వ నాథుల వెంకటాచారి, కంభంపాటి సైదులు,నాగిళ్ల ఆంజనేయులు, ఈగల ప్రశాంత్, అనుముల దుర్గయ్య గా పోలీసులు గుర్తించారు.వారి వద్ద నుండి రూ.8100 నగదు,6 సెల్ ఫోన్లు 52 పేకా ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారంతా ఇబ్రహీంపేట గ్రామానికి చెందిన వారిగా పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. జూదం ,పేకాట, గంజాయి ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ ఐ సాయి ప్రశాంత్ హెచ్చ రించారు.

# నల్లగొండ జిల్లా సర్పంచుల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చింతలపూడి భాస్కర్ రెడ్డి నియామకం: ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఘన సన్మానం

**దేవరకొండ, సెప్టెంబర్ 23,(ప్రజా జ్యోతి) :**

డిండి సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, శాంతి గూడెం సర్పంచ్ చింతలపూడి భాస్కర్ రెడ్డి నల్లగొండ జిల్లా సర్పంచుల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ భాస్కర్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణతో, కష్టపడి పనిచేసే ప్రతి ఒక్క కార్యకర్తకు, నాయకుడికి ఏదో ఒక రోజు ఖచ్చితంగా తగిన గుర్తింపు, పదవులు దక్కుతాయని కొనియాడారు. గ్రామ స్థాయి నుండి పార్టీని నమ్ముకుని పనిచేస్తే.. భవిష్యత్తులో రాష్ట్ర స్థాయి నాయకులుగా ఎదిగే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పార్టీ కోసం శ్రమించే వారికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సన్మాన కార్యక్రమంలో చింతపల్లి మాజీ జెడ్పీటీసీ, కాంగ్రెస్ జిల్లా నాయకులు రామస్వామి, దేవరకొండ సర్పంచుల ఫోరం రాష్ట్ర గిరిజన నాయకులు కొర్ర రాంసింగ్ నాయక్, పాతలావత్ తండా మాజీ సర్పంచ్ వాంకుడావత్ రాజ్ కుమార్, సేసాయి కుంట మాజీ సర్పంచ్ ఆంజనేయులు, కొట్టే అనంతయ్య మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సొంత గ్రామ అభివృద్ధి నా బాధ్యత

- తాటిపాములలో రూ.7 కోట్లతో పాఠశాలల బలోపేతానికి శంకుస్థాపన
- అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.80 లక్షలు మంజూరు
- యశ్వంత్‌పూర్ వాగుపై రూ.16 కోట్ల చెక్‌డ్యామ్‌కమ్‌బ్రిడ్జి పనుల పరిశీలన
- రాష్ట్ర పౌరసరఫరాలు,నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి









**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23(ప్రజా జ్యోతి):**

తాను పుట్టి పెరిగిన తాటిపాముల గ్రామంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌తో కలిసి తిరుమలగిరి మండలం తాటిపాములలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సీఎస్ఆర్ నిధులు రూ. 5 కోట్లతో జెడ్పీ ఉన్నత పాఠశాల బలోపేతం పనులకు, జెన్‌కో నిధులు రూ. 2 కోట్లతో ప్రాథమిక పాఠశాల బలోపేతం పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం రూ. 16 కోట్ల వ్యయంతో యశ్వంత్‌పూర్ వాగుపై నిర్మిస్తున్న చెక్‌డ్యామ్‌కమ్‌బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాటిపాములలో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు రూ. 7 కోట్లతో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో అదనపు గదులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఏడాదిలోపు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.80 లక్షలు

గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవని గ్రామస్థులు మంత్రి దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే స్పందించారు. నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలకు ఒక్కొక్కదానికి రూ. 20 లక్షల చొప్పున మొత్తం రూ. 80 లక్షలు మంజూరు చేశారు. ఆధునిక సౌకర్యాలతో భవనాలను నిర్మించాలని, ప్రహరీ గోడలు, మరుగుదొడ్లతో పాటు అవసరమైన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. యశ్వంత్‌పూర్ వాగుపై నిర్మిస్తున్న చెక్‌డ్యామ్‌కమ్‌బ్రిడ్జి పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసి తుంగతుర్తి నియోజకవర్గానికి సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమ్మక్కసారలమ్మ ప్రాజెక్టును కూడా పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

## నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్త్రీశక్తి భవనాలు, పాఠశాలలకు అదనపు భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, జిల్లా ఎస్పీ కె. నరసింహ, సూర్యాపేట మార్కెట్ చైర్మన్ వీణారెడ్డి, ఆర్డీవో వేణుమాధవ్, డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, సర్పంచ్ కిషన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆకాంక్షల మేరకే సంక్షేమ పథకాల అమలు

- స్మార్ట్ రేషన్ కార్డులను ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలి
- గ్రామ అభివృద్ధికి ఉత్తమ్ దంపతుల సహకారంతో కృషి: సర్పంచ్ దున్నా శ్రీనివాస్

**నడిగూడెం, సెప్టెంబర్23, ప్రజా జ్యోతి:**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని నడిగూడెం సర్పంచ్ దున్నా శ్రీనివాస్ అన్నారు. బుధవారం నడిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో కోదాడ ఎమ్మెల్యే నలమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డి ఆదేశాల మేరకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ దున్నా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి రేషన్ కార్డుదారుడు నూతన స్మార్ట్ రేషన్ కార్డును తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. లబ్ధి దారులకు అవసరమైన సమాచారాన్ని పొందుపరిచే విధంగా స్మార్ట్ రేషన్ కార్డులను రూపొందించినట్లు తెలిపారు. ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోం దన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే నలమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డి దంపతుల సహకారంతో నడిగూడెం గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యలక ఉమారాణి, ఉప సర్పంచ్ ఎలుగూరి నాగరాజు, వార్డు సభ్యులు దున్న శ్రీకాంత్, దున్న లింగయ్య, నాగారపు సరస్వతి రాము, బాణాల సతీష్ కుమార్, గుండు మహేందర్ ప్రసాద్, కాసాని




మాధవి గోపీనాథ్, రేషన్ డీలర్లు మాధవి, కల్పన, ఆశా కార్యకర్త లక్ష్మీతో పాటు నాయకులు గుండు విజయ రామారావు, దున్నా రాజు, జలీల్, కాసాని పుల్లయ్య, దస్తగిరి, పందిటి శ్యామ్, దున్నా వీరమ్మ, గంటే పంగు ముత్యాలమ్మ తదితరులు, రేషన్ కార్డుదారులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై క్షేత్రస్థాయి అవగాహన

- సిరిపురం సమీకృత వ్యవసాయ క్షేత్రంలో 66 మంది విద్యార్థుల సందర్శన
- పంటల సాగు.. నేల ఆరోగ్యం.. ద్రావణాలు, కషాయాల తయారీపై పరిశీలన

**నడిగూడెం, సెప్టెంబర్23, ప్రజాజ్యోతి:**

మండలంలోని సిరిపురం గ్రామంలో రైతు వాసికర్ల శేషుకుమార్ నిర్వహిస్తున్న సమీకృత ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని వివిధ వ్యవసాయ కళాశాలలకు చెందిన 66 మంది విద్యార్థులు కేవీకే గడ్డిపల్లి శాస్త్రవేత్తలతో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న వరి, వేరుశెనగ, పండ్ల మొక్కలు, కూరగాయల పంటలను విద్యార్థులు పరిశీలించారు. పంటల పెరుగుదల, నేల ఆరోగ్యం, నీటి వినియోగం, పురుగులుతెగుళ్ల పరిస్థితిపై క్షేత్రస్థాయిలో అవగాహన పొందారు. అనంతరం రైతు శేషుకుమార్‌తో పంటల సాగు విధానాలు, ప్రకృతి వ్యవసాయంలో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చించారు.పంట అవశేషాలను సద్వినియోగం చేసుకోవడం, నేలలో సేంద్రియ పదార్థాన్ని పెంచడం, అవసరానికి అనుగుణంగా జీవ ఆధారిత ఇన్‌పుట్‌లను వినియోగించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని కేవీకే శాస్త్రవేత్తలు వివరించారు. అలాగే ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే వివిధ ద్రావణాలు, కషాయాల తయారీ విధానం, వాటి వినియోగంపై విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన



కల్పించారు.ప్రకృతి వ్యవసాయ పద్ధతులను క్షేత్రస్థాయిలో పరిశీలించడం ద్వారా విద్యార్థులకు ఆచరణాత్మక పరిజ్ఞానం లభించిందని శాస్త్రవేత్తలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కేవీకే గడ్డిపల్లి శాస్త్రవేత్తలు సి.హెచ్. నరేష్, ఎ. కిరణ్, డాక్టర్ పి. అక్షిత్ సాయి, ఎ. నరేష్, రైతులు వాసికర్ల శేషుకుమార్, లక్ష్మీ ప్రియా, వెంకటేశ్వర్ రెడ్డి, సిరి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యం. గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

# కొల్లూరులో గ్రామసభ

**ఆలేరు సెప్టెంబర్ 23 (ప్రజా జ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొల్లూరు గ్రామంలో గ్రామపంచాయతీ ఆవరణంలో కరువు పనులు భాగంగా సోషల్ ఆడిట్ గ్రామసభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2025- 26 సంవత్సరంలో ఉపాధిహామీల్లో చేపట్టిన పనులను పెన్షన్లను తనిఖీ బృందం పరిశీలించి అట్టి పనులను పెన్షన్ వివరాలను గ్రామసభలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో అరుణకుమారి, గ్రామ సర్పంచ్ జనగాం సుధారాణి శ్రీపాల్ రెడ్డి, ఉపసర్పంచ్ గాజుల దశరథ, పంచాయతీ కార్యదర్శి వానరాశి సాయిలు, ఫీల్డ్ అసిస్టెంట్ మహేష్, వార్డు సభ్యులు, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.







# చండూరు మున్సిపాలిటీ కేంద్రంలోని శివాజీ నగర్ లో ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు - రావిరాల నగేష్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా వేడుకలు

**చండూరు సెప్టెంబర్ 23 (ప్రజా జ్యోతి)**

చండూరు మున్సిపాలిటీ కేంద్రంలోని శివాజీ నగర్ లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. స్థానిక యువ నాయకులు రావిరాల నగేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం, సాయంత్రం స్వామివారికి అభిషేకాలు, భజన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తులకు కనువిందు చేస్తున్నారు. ప్రతిరోజూ భక్తులకు అన్నప్రసాద వితరణ కూడా చేస్తున్నారు. ఈ ఉత్సవాలకు చుట్టుపక్కల కాలనీల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గణనాథుడిని దర్శించుకుంటున్నారు. గణేష్ మండపాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో, పూలతో హక్కుఅందంగా అలంకరించారు. ఈ కార్యక్రమం లో శివాజీ నగర్ వాసులు, యువకులు, మహిళలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొంటున్నారు.



# గణేష్ నిమజ్జనానికి సర్వం సిద్ధం

## - ప్రశాంత వాతావరణంలో శోభాయాత్ర నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు..

## - జిల్లా వ్యాప్తంగా 6 వేల విగ్రహాలు.. బుధవారం ఒక్కరోజే 2 వేల విగ్రహాల నిమజ్జనానికి అవకాశం

## - నిమజ్జన ప్రదేశాల్లో వైద్య, రెవెన్యూ, పోలీస్ బృందాల ఏర్పాటు..









**నల్లగొండ, సెప్టెంబర్ 23 (ప్రజాజ్యోతి):**

నల్లగొండ జిల్లాలో గణేష్ నిమజ్జనం, శోభాయాత్రను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని హనుమాన్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఒకటో నంబర్ వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మేయర్, ఇతర ప్రజాప్రతినిధుల సూచనల మేరకు జిల్లాలో గణేష్ నిమజ్జనానికి విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా సుమారు 6 వేల వినాయక విగ్రహాలు ఉన్నాయని, గత ఐదు రోజులుగా నిమజ్జన ప్రదేశాలకు విగ్రహాలు తరలివస్తున్నాయని చెప్పారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు మరో 2 వేల విగ్రహాలు నిమజ్జనం అయ్యే అవకాశం ఉందన్నారు.

### భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు..

శోభాయాత్ర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని నిమజ్జన ప్రదేశాల్లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. శాంతి కమిటీలు, గణేష్ ఉత్సవ కమిటీల సమన్వయంతో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించామని చెప్పారు. నిమజ్జన ప్రదేశాల్లో వైద్య బృందాలతో పాటు రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు, సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.భక్తులు భక్తిశ్రద్ధలతో శోభాయాత్రలో పాల్గొని, ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమం విజయవంతం కావడానికి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ కోరారు.

### 2 వేల విగ్రహాల నిమజ్జనానికి పోలీస్ బందోబస్తు..

జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ.. బుధవారం ఒక్కరోజే జిల్లాలోని 8 నిమజ్జన ప్రదేశాల్లో సుమారు 2 వేల వినాయక విగ్రహాలు నిమజ్జనం అయ్యే అవకాశం ఉందన్నారు. శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా కొనసాగేలా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రధాన శోభాయాత్ర మార్గాలు, నిమజ్జన ప్రదేశాల వద్ద పోలీస్ సిబ్బందిని మోహరించి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. భక్తులు పోలీసులకు సహకరిస్తూ శాంతియుతంగా శోభాయాత్రను నిర్వహించుకోవాలని ఎస్పీ కోరారు. 14 మైలురాయి వద్ద నిమజ్జనానికి సరిపడా నీరు అందుబాటులో ఉందని, విగ్రహాల నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు.

### అధికారుల సమన్వయంతో నిమజ్జన ఏర్పాట్లు..

జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ, మున్సిపల్ అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీలు, శాంతి కమిటీల సమన్వయంతో నిమజ్జన ఏర్పాట్లు చేపట్టారు. నిమజ్జన ప్రదేశాల్లో భద్రత, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర సౌకర్యాలను అందుబాటులో ఉంచారు. శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ రమేష్, నల్లగొండ ఆర్డీఓ వై. అశోక్ రెడ్డి, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రుల్లో భక్తిశ్రద్ధలతో అన్నదానం

## - అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పది: - ఎస్సై తేజస్విని.

**నడిగూడెం, సెప్టెంబర్23, ప్రజాజ్యోతి:**

మండల కేంద్రంలోని తోట బజార్‌లో యంగ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎస్సై తేజస్విని, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తిరుపతమ్మ సుధీర్, గ్రామ సర్పంచ్ దున్న శ్రీనివాస్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎస్సై తేజస్విని మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని, ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం పుణ్యకార్యమని అన్నారు. భక్తులు, నిర్వాహకులు సమన్వయంతో ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఏలుగూరి నాగరాజు, వార్డు సభ్యులు దున్న మనీషా, కాసాని శైలజ సతీష్, గుండు శ్రీనివాస్, ఎస్కే జలీల్, ఖలీల్ అహ్మద్, పంచాయతీ కార్యదర్శి ఎలక ఉమారాణి, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ఎస్ఎల్బీసీ పూర్తయితే నల్లగొండ సస్యశ్యామలం..

- ఎల్ నినో ప్రభావంపై ఇంజనీర్లతో మంత్రి సమీక్ష సమావేశం..- ఖైరతాబాద్ లోని విశ్వేశ్వరయ్య ఇంజనీర్ల భవన్లోముఖ్యఅతిథిగా పాల్గొన్న...మంత్రి.
- గుర్రం కోటిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళి..- ఫ్లోరైడ్ సమస్యకు పరిష్కారం.. రెండు పంటలకు సాగునీరు..
- వ్యవసాయ రంగ అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకం...- ఎస్ఎల్బీసీ పూర్తయితే నా జన్మ ధన్యం...మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి








**నల్గొండ సెప్టెంబర్ 23,(ప్రజా జ్యోతి):**

ఎస్ఎల్బీసీ సొరంగం పూర్తయితే నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు గురుత్వాకర్షణ ద్వారా రెండు పంటలకు సాగునీరు అందించే అవకాశం ఉంటుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. సొరంగం పూర్తయితే తన జన్మ ధన్యమవుతుందని అన్నారు. ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య ఇంజినీర్ల భవన్‌లో నిర్వహించిన 'ఎల్‌నినో ప్రభావం – సాగునీటి రంగం, వ్యవసాయం' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ ఇంజినీర్ గుర్రం కోటిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. అనంతరం గుర్రం కోటిరెడ్డి స్మారక పురస్కార గ్రహీతలను సన్మానించి అవార్డులు అందజేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్న నేపథ్యంలో కరువు నివారణకు ఇంజినీర్లు తమ విలువైన సూచనలు, సలహాలను ప్రభుత్వానికి అందించాలని మంత్రి కోరారు. దేశ అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకమని, ముఖ్యంగా వ్యవసాయ రంగం అభివృద్ధికి వారి సాంకేతిక నైపుణ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్ శాఖల ద్వారా తొలి దశలో రూ.20 వేల కోట్లతో హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామానికి తారు రహదారి, గ్రామం నుంచి మండల కేంద్రానికి, మండలం నుంచి జిల్లా కేంద్రానికి మెరుగైన రహదారి అనుసంధానం కల్పించడమే లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఏక వరుస రహదారులను అవసరాన్ని బట్టి




రెండు, నాలుగు వరుసల రహదారులుగా అభివృద్ధి చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

## లంబో "దర,లడ్డుకు రూ. 25 016 రూపాయలు

### గణనాధుని లడ్డు వేలం పాటలో సొంతం చేసుకున్న కొమ్మన బోయిన మల్లేష్ యాదవ్ ( జెడ్డి మల్లేష్ )

**నార్కట్ పల్లి, సెప్టెంబర్ 23(ప్రజా జ్యోతి):**

నల్లగొండ జిల్లా నార్కట్ పల్లి మండలం కొండపాక ని గూడెం గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా బీసీ కాలనీలో ఏర్పాటుచేసిన ఘననాధుని లడ్డుకు బుధవారం వేలంపాట నిర్వహించిన వేలం పాటలో కాలనీవాసులు భక్తులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. తీవ్ర పోటీ నడుమ సాగిన ఈ వేలం పాటల స్వామి వారి ప్రసాద లడ్డును కొమ్మన బోయిన మల్లేష్ యాదవ్ ( జెడ్పి మల్లేష్ యాదవ్) – లింగమ్మ, చిన్న గణపతి వద్ద ఏర్పాటు చేసిన లడ్డును ఆగు స్వామి యాదవ్ 13 వేల రూపాయలకు కైవసం చేసుకున్నారు. కమిటీ సభ్యులు వారిని శాలువాలతో సన్మానించి, డిజె సౌండ్ల మధ్య ఊరేగింపుగా వారి ఇంటి వరకు సాగనింపారు.



## అరూరు వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన వాకిటి

**వలిగొండ సెప్టెంబర్ 23 (ప్రజాజ్యోతి న్యూస్)**

వలిగొండ మండల పరిధిలోని అరూరు గ్రామంలో గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాధునికి వలిగొండ మాజీ జడ్పిటిసి వాకిటి పద్మ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణేష్ యూత్ కు 5 వేల రూపాయల చందాను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు జాడ నవీన్, ఆవుల స్వామి, వార్డ్ సభ్యులు క్యాదరి మనిషా నరేష్, బి రాజు, మాజీ వార్డు సభ్యులు బత్తిని నగేష్, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు ఎర్ర సాయి చిలకమర్రి నరసింహ చారి, శ్రీనివాస్, తుమ్మల మురళి, ఆముద శ్రావణ్, క్యాదరి రాజు, బత్తిని సతీష్, ఆముద సాయిబాబా, చిలకమర్రి నరసింహ చారి, కొడితల లక్ష్మయ్య, బుర్ర శ్రీకర్, బత్తిని కర్ణ గౌడ్, జాడ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## వినాయక మండపాలను సందర్శించిన ఏలే చంద్రశేఖర్

**వలిగొండ సెప్టెంబర్ 23 (ప్రజాజ్యోతి న్యూస్)**

గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వలిగొండ మండల కేంద్రంతో పాటు మల్లేపల్లి,గోకారం,జాలు కాలువ గ్రామాలలోని వినాయక మండపాలను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్,బీజేపీ నాయకులతో కలిసి గణేష్ మండపాలు సందర్శించి గణనాధులకు ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం మండపాల నిర్వాహకులు ఏలే చంద్రశేఖర్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు.అనంతరం వలిగొండ మండల కేంద్రంలోని అన్నదాన కార్యక్రమం, మల్లేపల్లిలో శ్రీరామ్ యూత్ గణనాథుడి శోభాయాత్రలో పాల్గొన్నారు.ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్,ఉపాధ్యక్షుడు మందల నాగరాజు,వార్డు సభ్యులు మైసొల్ల రామ నర్సు,దంతూరి వరుణ్,మాజీ ఉపసర్పంచ్ మైసొల్ల మత్స్యగిరి,బుగ్గపట్ల మహేష్, తదితరులు పాల్గొన్నారు.



## వినాయక నిమజ్జనంలో ఘర్షణ.. 18 మందిపై కేసు

**వలిగొండ సెప్టెంబర్ 23 (ప్రజాజ్యోతి న్యూస్):**

మండలంలోని అర్రూరు గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా బుధవారం తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో స్నేహ యూత్, ఫ్రెండ్స్ యూత్ సభ్యుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఘటనపై ఇరువర్గాలకు చెందిన 18 మందిపై వలిగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సంయమనం పాటించాలని పోలీసులు సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.